క్లుప్తంగా

నేడు దొమ్మేరులో రంగా విగ్రహావిష్కరణ

కొవ్వూరు: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహనరంగా శిలా విగ్రహాన్ని మండలంలో దొమ్మేరులో ఆవిష్కస్తారు. ఆ గ్రామ బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఆవిష్కరిస్తారని దొమ్మేరుబ సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు శనివారం తెలిపారు. 15 అడుగుల ఎత్తైన రంగా విగ్రహాన్ని కృష్ణాజిల్లా కలిదిండికి చెందినకాళ్లపాలెం బుజ్జి అనే దాత అందించారన్నారు. పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు హాజరవుతారన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం దొమ్మేరు పంచాయతీ కార్యాలయ సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నాగరాజు చెప్పారు.

చిట్యాలలో 300 మందికి నేత్ర పరీక్షలు

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల సిబ్బంది శిబిరంలో సుమారు 300 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎల్.ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. చిట్యాల సర్పంచ్ నూతంగి సరోజిని ఈ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

తాడిమళ్లలో హోమియో వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో హోమియో వైద్యుడు నిమ్మల రామారావు 52 మందిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అల్లూరి శ్రీనివాసరావు, సభ్యుడు పోసి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో అన్నసమారాధన

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామంలో కొత్తగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద శనివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి నూతన ఆలయంలో ఈనెల 5న విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. చిట్యాల, వెంకటయాయపాలెం, చెరుకుమిల్లి, పెద్దాపురం, అన్నదేవరపేట గ్రామాల భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతు వజ్జల రామకృష్ణశాస్త్రి, నందిన శ్రీనివాసరావు తెలిపారు.

కరెన్సీనోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి

కొవ్వూరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వారోత్సవాలను ఈ నెల 8 నుంచి 14 వరకూ నిర్వహించనున్నట్లు మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. స్థానిక క్రిస్టియన్‌పేట మెరక వీధి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన శనివారం పూలమాల వేసి నివాళులు అర్పించి, వారోత్సవాలను ప్రారంభించారు. కరెన్సీ నోటుపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలని, ఎస్సీల మతస్వేచ్ఛను హరించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని ఈ సందర్భంగా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ ఏజీఎం చెల్లె శేఖర్, మాసా ఆనంద్, సాకా పుల్లారావు, దొంకా అప్పన్న, తిరిపల్లి మోహన్‌రావు, ఎస్.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మత్తులో బీర్ బాటిల్‌తో దాడి

కొవ్వూరు: మద్యం మత్తులో మద్దూరుకు చెందిన మచ్చా వెంకటరమణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన దేవా రాధాకృష్ణ తలపై బీరు బాటిల్‌తో కొట్టి గాయపరిచాడు. ఈ ఘటన శుక్రవారం మద్దూరు గ్రామంలో జరిగింది. కొవ్వూరు రూరల్ పోలీసుల కథనం ప్రకారం లారీ డ్రైవర్లయిన వారిద్దరూ శుక్రవారం వాడపల్లి వెళ్లి మద్యం తాగి మద్దూరుకు తిరిగి వచ్చారు. ఈ సమయంలో రాధాకృష్ణ లైసెన్స్ లేకుండానే లారీ నడుపుతున్నావంటూ వెంకటరమణను కామెంట్ చేశాడు. దాంతో అతడు రాధాకృష్ణతో గొడవ పడ్డాడు. అంతటితో ఊరు కోకుండా చేతిలో ఉన్న బీరు బాటిల్‌లో రాధాకృష్ణ తలపై కొట్టి గాయపరిచారు. లారీ ఓనర్ సతీష్ సహకారంతో క్షతగాత్రుడు రాధాకృష్ణ కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. రాధాకృష్ణ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొమ్మేరులో స్థల ఆక్రమణపై మహిళ ఫిర్యాదు

కొవ్వూరు: దొమ్మేరులోని తన స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన బండ్రెటి మోహనరావు అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడంటూ పెరవలి మండలం కాకరపర్రుకు చెందిన మద్దిశెట్టి సత్యవతి కొవ్వూరు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గతంలో రెండు సెంట్ల స్థలాన్ని మోహనరావుకు విక్రయించానని, ఆ పక్కనే ఉన్న మిగిలిన తన భూమిని ఆక్రమించుకున్నారని ఆమె తెలిపింది. ఇదేమిటని అడిగితే గొడవ పడుతున్నట్టు ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు.

రెండు పండగలు ఒకే రోజున..

- అంబేడ్కర్ జయంతి నాడే సీఎం జగన్ రాక
- ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయవంతం చేయాలి
- పార్టీ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మంత్రి తానేటి వనిత
- హాజరైన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతినాడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా కొవ్వూరు పర్యటనకు వస్తున్నందున రెండు పండగలు ఒకే రోజున వస్తున్నాయని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటన ఖరారైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ శ్రేణులతో శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయవంతానికి నాయకులందరూ సహకరించాలన్నారు. పార్టీ శ్రేణులందరూ సీఎం సభావేదిక వద్దకు సకాలంలో చేరుకోవాలన్నారు. గత 45 నెలల పాలనలో వలంటీర్లు అందించిన సేవలకు ముఖ్యమంత్రి ఈ సభలో వారిని సముచిత రీతిన సత్కరిస్తారన్నారు. బహిరంగ సభ నిర్వహించే ప్రాంతం, సమయం తర్వాత తెలియజేస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సన్నాహకాల్లో భాగంగా నియోజకవర్గంలోని ఒక్కో మండలంలోని గ్రామాలను రెండుగా విభజించి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 10 ఉదయం తాళ్లపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపంలోను, మధ్యాహ్నం 4 గంటలకు మలకపల్లి కళ్యాణ మండపంలోను సమావేశాలు జరుపుతామన్నారు. కొవ్వూరు మండలానికి 11న మద్దూరులో ఉదయం పది గంటలకు కొన్ని గ్రామాలకు, ధర్మవరంలో సాయంత్రం నాలుగు గంటలకు మిగిలిన గ్రామాలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. చాగల్లు మండలానికి 12 ఉదయం పది గంటలకు నెలటూరు కల్యాణ మండపంలోను, మధ్యాహ్నం కలవలపల్లిలోని ఫంక్షన్ హాల్లోను సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు. నిర్దేశిత గ్రామాల పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు ఆయా సమావేశాలకు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశాలకు ఆయా గ్రామాల నాయకులు బాధ్యత తీసుకోవాలని మంత్రి వనిత కోరారు. వైస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య మాట్లాడుతూ ఈ సభ దిగ్విజయం చేయడం ద్వారా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలాన్ని చాటి చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీలు కాకర్ల నారాయుడు, జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరస్వామి, జెడ్పీ వైస్ చైర్పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మునిసిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మలు తమ ప్రసంగాల్లో ముఖ్యమంత్రి సభను విజయవంతానికి నాయకులంతా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు.

విరాళాలు..

ముఖ్యమంత్రి సభకు హాజరయ్యే పార్టీ కార్యకర్తలకు తాగునీరు, అల్పాహారం ఏర్పాట్లకు కౌన్సిలర్ బత్తి నాగరాజు రూ.50 వేలు, పార్టీ నాయకులు ఘంటా చిరంజీవి రూ.25 వేలు, గంధం శేషసాయి రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. పార్టీ తాళ్లపూడి, చాగల్లు మండలాల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి పరశు రామారావు, మలకపల్లి, దొమ్మేరు సొసైటీల అధ్యక్షులు కుంటముక్కల కేశవనారాయణ, ముదునూరి నాగరాజు, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.



పాలనలో వ్యత్యాసాన్ని వివరించేందుకే..



కొవ్వూరులో గృహ సారథులు, వలంటీర్లకు కిట్లు అందిస్తున్న మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- వలంటీర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం
- 'జగనన్నే మా భవిష్యత్తు' నిర్వహణపై సమీక్ష

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గత టీడీపీ హయాంలోని పథకాలతో పోల్చి రెండింటిలోని వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించడమే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహణపై స్థానిక లిటరరీ క్లబ్ కన్వెన్షన్ హాల్లో శనివారం సాయంత్రం సమీక్ష జరిగింది. గ్రామ వలంటీర్లు, గృహ సారథులను ఉద్దేశించి మంత్రి వనిత మాట్లాడారు. రెండు ప్రభుత్వాల మధ్య గల తేడాపై ప్రజలను ప్రశ్నలు అడిగి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు. గృహ సారథులకు, వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను మంత్రి అందించారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, పలువురు నాయకులు మాట్లాడారు.



త్యాజంపూడిలోని ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే తలారి. చిత్రంలో ఎంపీ బోస్ తదితరులు

మరెక్కడా లేని విధంగా పథకాలు: ఎంపీ బోస్

దేవరపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని త్యాజంపూడిలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి వారిద్దరూ ఆ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఇంటి యజమాని అంగీకారంతో ఇంటి గోడలకు జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికించారు. త్యాజంపూడి–యర్నగూడెం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, గృహ సారథుల మండల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పలువురు పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల జీవితాల్లో 'నకారా' వెలుగులు

నిడదవోలు రూరల్: పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు డీఎస్ నకారా చేసిన కృషి మరువలేనిదని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీఎన్ కృష్ణారావు అన్నారు. మానవత సంస్థ నిడదవోలు కార్యాలయంలో డీఎస్ నకారా జయంతిని పెన్షనర్లు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కుందుల ప్రభాకరం, కోశాధికారి లక్కు తులసమ్మ, సభ్యులు ఎస్‌వీ చౌదరి, ఎంఎస్ నాగేశ్వరరావు, కె.సూర్యచంద్రరావు, ఏవీ రమణ, డి.రామలింగశాస్త్రి పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: రిటైర్డు ఉద్యోగులకు పూర్తిస్థాయి పెన్షన్ సౌకర్యం కల్పించిన ఘనత ధరం స్వరూప నకారాదే అని రిటైర్డు ఉద్యోగుల సంఘ మండల శాఖ అధ్యక్షుడు ఇమ్మణ్ణి వెంకటసత్యం అన్నారు. నకారా జయంతిని శనివారం స్థానిక వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో ఐవీ సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1979 మార్చి 31కు ముందు రిటైరైన కేంద్ర ప్రభుత్వోద్యోగులు పెన్షన్‌కు అర్హులు కారంటూ అప్పటి కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందన్నారు. దీనిపై నకారా సుప్రీం కోర్టులో రిట్ వేసి పెన్షన్ సాధించారన్నారు. కార్యక్రమంలో ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ప్రభుదాస్, ఏసురత్నం, బాలయ్య, నెక్కలపూడి ప్రతాప్, సుంకర దత్తు, రాజేంద్రప్రసాద్, కేజేడీవీ ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.




నల్లజర్లలో నకారా జయంతి వేడుకలో పెన్షనర్లు

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ప్రభుత్వాసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్ ప్రారంభం

నిడదవోలు రూరల్: ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందన్న నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఓఎన్జీసీ సహకారంతో నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే మెషీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో 9 మంది వైద్యులను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర కేసులతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ఇరవై నాలుగు గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో హాస్పిటల్ బిల్డింగ్‌లు తప్ప వైద్యులు, మందులు అందుబాటులో ఉండేవి కాదన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ సనత్ కుమారి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు, కౌన్సిలర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు